క్లుప్తంగా

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం


పి.రాజారావు

దాచేపల్లి: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. నారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా పి.రాజారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నాగెండ్ల ఏసయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ నాగుల్‌మీరా, వీఎం రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా తగరం ఆనంద్‌కుమార్, సహాయ కార్యదర్శిగా లంకె వాసుదేవరావుతో పాటుగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు కోరారు. నూతన కమిటీ పలువురు నాయకులు అభినందించారు.

గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం



కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ముందుగా గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కొండలు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి



కారెంపూడి: సత్యసాయి బాబా జయంతి వేడుకలను స్థానిక షిరిడీ సాయి, సత్యసాయి సేవా సదన్‌లో భక్తులు శనివారం నిర్వహించారు. సత్యసాయి బాబా చిత్రపటాన్ని భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మందిర కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్‌లో..

విజయపురిసౌత్: సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు విజయపురిసౌత్‌లోని సత్యసాయి ప్రేమ మందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమంత చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు జరిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, హిల్ కాలనీ కమలా నెహ్రూ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త కె.శ్రీహరి ప్రసాద్, జానారెడ్డి, వెంకట సుబ్బయ్య, గొంతిన సాయి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం సత్తెనపల్లిలో జరిగింది. త్రిపురాంతకం నుంచి కృష్ణా జిల్లా నందిగామకు గోపి, భవాని దంపతులు ఇద్దరు పిల్లలతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. సత్తెనపల్లి చేరుకోగానే ద్విచక్ర వాహనం చక్రంలో చున్నీ ఇరుక్కోవడంతో.. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న భవాని ఒక్కసారిగా రోడ్డుపై పడింది. ఆమె తల, మెడకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

వాహనాల తనిఖీ



బెల్లంకొండ: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంకొండ ఎస్సై డి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపాలెం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి, ఫైన్ విధించారు. వాహనాలను పరిమిత వేగంతో నడపాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఎస్‌ఐ వెంట ఏఎస్‌ఐ ముసలారావు, కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

నూతన పత్తి వంగడంపై అవగాహన

అమరావతి: మండల కేంద్రంలో శనివారం తులసి సీడ్స్ సంస్థ అకిరా వంగడం క్షేత్ర ప్రదర్శన నిర్వహించింది. అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని 25 గ్రామాల నుంచి 500 మంది రైతులు పాల్గొన్నారు.

మిర్చి రైతు కంట కన్నీరు

- గతేడాది మిర్చికి మంచి ధర
- ఈ ఏడాది ధర మరింత పెరుగుతుందని కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసిన రైతులు
- నేడు ధర పతనమైన వైనం
- లబోదిబో మంటున్న రైతాంగం
- ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని వేడుకోలు


కల్లం వద్ద మిర్చిని చూపుతున్న రైతు (ఫైల్)

వెల్దుర్తి: మాచర్ల నియోజకవర్గంలో ప్రతి ఏటా 60వేల ఎకరాలలో రైతులు మిర్చి పంటను సాగు చేస్తున్నారు.. వెల్దుర్తి మండలంలో 24వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. గత ఏడాది మిర్చికి అధిక ధర పలికింది. ఈ నేపథ్యంలో రైతులు ఈ ఏడాది సైతం ఇంకా ఎక్కువ ధర వస్తుందని ఆశపడి మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశారు. అయితే మిర్చి ధర పూర్తిగా పడిపోవటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

గతేడాది రూ.52వేలు.. నేడు రూ.16వేలు..

గత ఏడాది పండించిన బ్రాడీ మిర్చి క్వింటా రూ.52,000 పలకగా ప్రస్తుతం మిర్చి రూ.16వేలు పలుకుతుంది. మిగతా రకం మిరపకాయలు గత ఏడాది రూ. 22వేలు పలకగా ఈ ఏడాది రూ. 12వేలకు పడిపోయింది. గత సంవత్సరం పండించిన పంట కోల్డ్ స్టోరేజ్‌లో 80శాతం నిల్వలు ఉండగా, ఈ ఏడాది పండించిన పంట మద్దతు ధర ఎలా ఉంటుందోనని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. లక్షలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ధర రాకపోవటంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నష్టాలు చవి చూస్తున్నాం



రూ.లక్షలు పెట్టుబడి పెట్టి 5 ఎకరాలలో మిర్చి పంటను పండిస్తే ఆ పంటకు తగిన మద్దతు ధర లేకపోవటం వలన అప్పులపాలవుతున్నాం. మిర్చి పంట వేసినప్పటి నుంచి వ్యవసాయం, మొక్కల కొనుగోలు, కలుపులు తీయటం, ఎరువులు పెట్టడం, మందులు వేయడంతో ఎకరానికి రూ. 2లక్షలు పెట్టుబడి అవుతుంది. సరైన ధర లేక అప్పులపాలవుతున్నాం.

– కేతావత్ అంజినాయక్, వజ్రాలపాడు తండ

కోల్డ్ స్టోరేజ్‌లోని మిర్చిని కొనుగోలు చేయాలి



గత ఏడాది 4 ఎకరాలలో మిర్చి పంటను వేశాను. 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మరింత ధర వస్తుందని కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచాం. ఈ ఏడాది ధర ఇంకా పడిపోవటంతో తీవ్ర ఆందోళనలో ఉన్నాం. గత ఏడాది పండిన పంటకు మంచి ధర ఉన్నప్పటికీ ఇంకా ఎక్కువ ధర వస్తుందని కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశాం. ఇప్పుడు ఆ మిర్చికి పూర్తిగా ధర పడిపోయింది. నష్టాల్లో ఉన్నాం.

– కంపసాటి కోటయ్య, రైతు, గంగలకుంట

మిర్చికి మద్దతు ధర ప్రకటించాలి



మేం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి 8 ఎకరాల్లో మిర్చి పంటను పండిస్తున్నాం. పంట పండిన తరువాత తగిన ధరలు లేకపోవటంతో అప్పులపాలయ్యాం. 100 క్వింటాళ్ల మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచాను. ఖర్చులు అధికంగా రావటం వలన పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– దిరిసినాల హనిమిరెడ్డి, శిరిగిరిపాడు

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను 10 ఎకరాలలో మిర్చి పండించాను. సరైన ధర కల్పించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉన్న మిర్చికి మద్దతు ధర కల్పించి అవి కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పంట పండించినప్పటికీ సరైన ధరలు లేకపోవటం వలన అమ్ముకోకుండా అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– దేవిశెట్టి రంగయ్య, రైతు, శిరిగిరిపాడు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్


పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ పర్వతనేని శ్రీధర్

పిడుగురాళ్ల: ఇంటి పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ... పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేసి, చెత్త నిల్వ లేకుండా తొలగించాలన్నారు. అలాగే పట్టణంలోని నివాస ప్రాంతాలలో కూడా స్థానికులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఈ సందర్భంగా సూచించారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే ఆరోగ్య పరిరక్షణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్రం


పిడుగురాళ్ల ఎస్టీయూ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్మిక రైతు సంఘాల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, దీనిలో భాగంగానే రైతులకు అన్యాయం చేసే మూడు నల్ల చట్టాలను తీసుకొని వచ్చిందన్నారు. ఈ చట్టాల రద్దు కోసం రైతు, కార్మిక సంఘాలు 13 నెలల పాటు పోరాడి రద్దు చేసుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏ మాత్రం అమలు చేయలేదని, అలాగే వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పీడ్‌గా అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నేడు కేవలం నాలుగు వేతన కోడ్‌లను ప్రభుత్వం అమలు చేస్తుందని, దాని ద్వారా కార్మికులు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సేవలో మునిగిపోయి రైతు, కార్మిక ప్రయోజనలను తాకట్టు పెట్టిందని వారు విమర్శించారు. ఈ నెల 26వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని ఈసందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు జయ కృష్ణనాయక్, రైతు కూలీ సంఘం నాయకులు నీలాద్రి రాంబాబు, కేఎన్‌పీఎస్ నాయకుడు కృష్ణ, ఎమ్మార్పీస్ నాయకుడు నాగేశ్వరరావు, ఎంఐఎం నాయకుడు ఖాన్, ప్రగతి శీల మహిళా సంఘ నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

దాచేపల్లి: దాతల సహకారం మరువలేనిదని సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య అన్నారు. మండలంలోని పెదగార్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు వీఎంఎన్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ50వేలు విలువ చేసే ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, అట్లాస్ పుస్తకాలను శనివారం అందించారు. విద్యార్థులు దాతల సహకారంతో ఉన్నతమైన చదువులు చదువుకోవాలని సర్పంచ్ వెంకటకోటయ్య చెప్పారు. ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మామిళ్ల నవీన్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఇంటర్మీడియట్ చదువుకునే నిరుపేదలైన 13మంది విద్యార్థులకు కళాశాల ఫీజుల కోసం ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ1.95లక్షల నగదుని ఫౌండేషన్ ద్వారా నవీన్ అందజేశారు. విద్యార్థులకు అండగా నిలిచిన ఫౌండేషన్ చైర్మన్ నవీన్‌ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మామిళ్ల నవీన్, హెచ్‌ఎం బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యం చెన్నారెడ్డి, తోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లి సుందరరామిరెడ్డి సేవలు మరువలేనివి


పిన్నెల్లి సుందరరామిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాచర్ల: పిన్నెల్లి సుందరరామిరెడ్డి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఈ ప్రాంత ప్రజలకు సేవలందించారని పలువురు నాయకులు కొనియాడారు. పిన్నెల్లి సుందరరామిరెడ్డి 29 వర్ధంతిని పార్కు సెంటర్‌లో వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు నేతలు వారి, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా ఉండి మహానేత వైఎస్సార్ అభిమానిగా ప్రజలకు సేవలందించిన సుందరరామిరెడ్డిని నియోజక వర్గ ప్రజలు మరచిపోలేరన్నారు. ఈ సందర్భంగా వారి కుమారులు పిన్నెల్లి మదనమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పిన్నెల్లి లక్ష్మారెడ్డి మనవళ్లు పిన్నెల్లి శివ తేజ, జయసింహారెడ్డి, పలువురు నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు.

నేడు విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

దాచేపల్లి: స్థానిక బ్రాహ్మణగడ్డలోని మదర్సా ఇస్లాహల్ బాణాత్ బాలికల పాఠశాలలో ఐదు సంవత్సరాలు అలీం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

నేడు వాసవి ఆర్యవైశ్య ట్రస్టు ప్రారంభం

గురజాల: మాడుగుల రోడ్డులో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ వాసవి ఆర్యవైశ్య వయోవృద్ధ సేవా ఆశ్రమ ట్రస్టు ప్రారంభోత్సవం శనివారం నిర్వహించడం జరుగుతుందని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

56 దరఖాస్తులు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని 274 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌కు 56 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. ఓటు నమోదుకు 22, తొలగింపునకు 18, సవరణకు 16 వచ్చాయన్నారు. ఆదివారం కూడా నియోజకవర్గంలోని 274 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి హరికృష్ణ

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలో సచివాలయ ఉద్యోగులు, వార్డు అడ్మిన్‌లు, కార్యదర్శులు, ఏబీడీటీ కార్యదర్శులు ఆస్తి పన్ను, నీటి పన్ను త్వరితగతిన వసూలు చేయాలని గుంటూరు రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి హరికృష్ణ అన్నారు. శనివారం మున్సిపాలిటీని సందర్శించి రెవెన్యూ వసూళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో పెండింగ్ బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. అదే విధంగా జనవరిలోపు 75శాతం పన్నులు వసూలు చేయటానికి ప్రత్యేకంగా బృందాలుగా ఏర్పడాలన్నారు. ఈ విషయంలో ఎవరూ రాజీపడకుండా విధులు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ప్రతి వార్డు ఉద్యోగులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కమిషనర్ వేణుబాబు, ఆర్‌ఐ వెంగయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

3,470 మంది ఓటర్లు

సత్తెనపల్లి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సత్తెనపల్లి పట్టణ వ్యాప్తంగా 3,470 మంది ఓటర్లు అర్హత సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేపట్టారు. పురుషులు 2,141 మంది, మహిళలు 1,329 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఎంపీపీ వేముల శేషమ్మ


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషమ్మ

గురజాల రూరల్: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ వేముల శేషమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సత్వరమే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో పెండింగ్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ చక్రపాణి

దాచేపల్లి: అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతమైన స్థానాల్లో నిలవాలని విశ్రాంత ఐఏఎస్ డి.చక్రపాణి అన్నారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చక్రపాణి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువుకుని మంచి జ్ఞానం సంపాదించుకోవాలని, ఉన్నతమైన చదువుల చదవటం ద్వారా మంచి అవకాశాలు వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ ఎస్‌వీ సుబ్బారావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.లీలావతిదేవి, ప్రిన్సిపాల్ టీజె. చంద్రశేఖర్‌బాబు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తెలనాకుల సత్యనారాయణ, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రవి, వాసు, నరసింహారావు, వెంకటరెడ్డి, కోటేశ్వరి, నర్మద, స్వాతి, జ్వాలాంబ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పత్తి దళారులకు అపరాధ రుసుం

క్రోసూరు: సత్తెనపల్లి తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా తూనిక రాళ్లను తనిఖీ చేసారు. అవతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించి అపరాధ రుసుం విధించారు. అమరావతి మండలానికి చెందిన వెంకట్రావు, షేక్ జానీ అనే వ్యాపారులు పీసపాడు గ్రామంలో పత్తి కొనుగోలు చేస్తున్నారు. తూనికరాళ్లను ఎలక్ట్రానిక్ కాటాతో సరిపోల్చగా 16 కిలోల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. సదరు వ్యాపారులకు ఒకరికి రూ.15 వేలు, మరొకరికి రూ.20 వేలు అపరాధరుసుం విధించారు. మరోసారి పట్టుపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట క్రోసూరు ఎస్‌ఐ కె.నాగేంద్రరరావు ఉన్నారు.

సురక్షిత గ్రామంపై అవగాహన


కరపత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదకూరపాడు: మండలంలోని గారపాడు గ్రామంలో మై ఛాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో లాంప్ సంస్థ శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్షిత గ్రామంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ల్యాంప్ సంస్థ కో–ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా లేని గ్రామాలే సురక్షిత గ్రామాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ ఎస్కే బాజీ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఉచితంగా కామిక్ బుక్స్ అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల బీమాపై శిక్షణ తరగతులు


శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం నరసరావుపేట వ్యవసాయ అధికారి ప్రవీణ్

రెంటచింతల: పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాల వలన రైతులకు బీమా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం నరసరావుపేట వ్యవసాయ అధికారి ప్రవీణ్ అన్నారు. మంగళవారం సత్రశాల వద్ద డివిజన్ పరిధిలోని రెంటచింతల, గురజాల, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాలలోని వివిధ గ్రామ రైతుసేవా కేంద్రాల సిబ్బందికి పంటల బీమాపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి రైతు సేవాకేంద్రాల సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు స్పెషల్ క్యాంప్‌లు

రాజుపాలెం: మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌వో) సమక్షంలో స్పెషల్ క్యాంప్‌లు ఆదివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు దుర్గేష్‌రావు శనివారం తెలిపారు. శనివారం నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లో ఓటు నమోదు కోసం ఆన్‌లైన్‌లో 4 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. చేర్పులు, మార్పులకు 10 దరఖాస్తులు వచ్చినట్లు, రాజుపాలెంలో 3, కోటనెమలిపురిలో 2, నెమలిపురిలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు వెల్లడించారు. ఆదివారం కూడా 18 ఏళ్లు నిండిన వారి ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపు నడుస్తుందన్నారు.

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తవ్వి వదిలేశారు



క్రోసూరు: జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కొళాయి నీరు అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. క్రోసూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పనులను ఆయన పరిశీలించారు. ఏడాది క్రితం మొదలు పెట్టిన జల జీవన్ మిషన్ పనులు నేటికీ పూర్తి కాలేదన్నారు. పైపులైన్ల కోసం సీసీ రోడ్లు తవ్వి తిరిగి బాగు చేయలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.